నకిలీ సంపద

భీమవరపు పురుషోత్తం

ప్రపంచంలోకెల్లా అతి ఎత్తైన శిఖరం ఎవరెస్ట్. ఎవరెస్ట్ కు ఆనుకొని వున్న శ్రేణులలోకెల్లా ఎత్తైన శిఖరం 'డిజియానా'. డిజియానాకి దాదాపు తొమ్మిది మైళ్ళ ఎగువన ఒక పర్వతారోహకుల బృందం ప్రయాణిస్తున్నారు. ఆ పర్వతం ఉనికి కనుగొన్న తర్వాత ప్రయాణించే బృందాలలో వాళ్ళది రెండవది.

దూరంనుండి వాళ్ళు చిన్న చిన్న నలకల్లా కనిపిస్తున్నారు.

అరచెయ్యి నుదుటిపై ఆన్చి, కళ్ళు చికిలించి క్రిందికి చూశాడు విద్యాసాగర్. కాళ్ళు కొద్దిగా వణకడంతో బాటు శరీరమంతా కంపించిందతడికి. చేతిలో ఐరన్ స్టిక్ ని మంచులో బలంగా గుచ్చాడు అప్రయత్నంగా.

"సాగర్ ఆ లోయలోనికి చూడకు. కళ్ళు తిరుగుతాయి" అలసటగా వినిపించిందో కంఠం.

ఆ కంఠం విని నవ్వుతూ తలతిప్పాడు సాగర్. తెల్లటి

మంచుతిన్నెల మధ్య కొద్దిగా వంగి నిలబడి వున్నాడు జస్వంత్. అతడి వీపుమీద దృఢమైన సంచి బిగించబడి వుంది. చేతులకు గ్లావ్స్ వున్నాయి. రెండు చేతుల్లోనూ వున్న ఐరన్ స్టిక్‌ని గుచ్చి పట్టుకున్నాడు. తలపై అతుక్కుపోయినట్టున్న బొచ్చు టోపీమీద మంచుపడి చిత్రంగా వున్నాడతడు.

సాగర్ దృష్టి పైకి పోనిచ్చాడు. ఇరవై అడుగుల దూరంలో జస్వంత్ లాంటి దుస్తులలో వున్న బృందం మెల్లగా సాగిపోతున్నారు.

"సాగర్! వచ్చేయ్. మళ్ళీ వాళ్ళకు దూరమైపోతాం!"

సాగర్ కొద్దిగా పరిగెడుతూ వచ్చి జస్వంత్‌తో కలిసాడు. ఇద్దరూ నడవసాగారు. చలికి గడ్డకట్టుకొని పోయిన శరీరంతో పరిగెట్టడంవల్ల ప్రారంభమైన నొప్పుల్ని పళ్ళబిగువున అణుస్తూ అడిగాడు సాగర్ "జస్వంత్! ఇంకా మనం యెంతదూరం పోవాలి ఈ రోజుకి?"

మిత్రుడి వంక చూస్తూ చెప్పాడు జస్వంత్ "చాలా దగ్గరికి వచ్చేశాం! దాదాపు పద్దెనిమిది కిలోమీటర్లు ప్రయాణం చేస్తే చాలు మాప్‌లో వున్న ప్రదేశం చేరుకొంటాం. బహుశా ఈ రోజు ప్రయాణంతోనే మనం ఆ దూరాన్ని పూర్తిచేయవచ్చునేమో!"

ఇద్దరూ బృందాన్ని సమీపించారు. వాళ్ళలో ఇద్దరు ముగ్గురు వెనక్కి తిరిగి మిత్రులవైపు చూసి నవ్వారు.

"పాల్కే సాబ్! ఇంకా యెంత సేపటిలో గుడారం వేయబోతున్నారు?" అడిగాడు జస్వంత్, పొడుగ్గా వుండి, నిండుగా వున్న గడ్డంతో గంభీరతను సంతరించు

కొన్న వ్యక్తిని.

కాసేపాగి చెప్పాడు పార్కే "మరో రెండు గంటల్లో అనువైన ప్రదేశం చూసి గుడారాలు వేసేద్దాం. మీరేమంటారు బెర్జీ?" వెనక్కి తిరిగి అడిగాడు గుంపులో చివరగా వున్న వ్యక్తిని.

పార్కే ఆ పర్వతారోహక బృందానికి నాయకుడు. బెర్జీ వయసులో పెద్దవాడేం కాదు. ఇరవై నాలుగేళ్ళుంటాయి అతడికి. అనవభజ్ఞాశిలా విశాలమైన నుదురు, తెలివితేటలు ప్రతిబింబించే సన్నటి ముఖం.

"ప్రస్తుతం వున్న వెలుతురుబట్టి చూస్తే మరో గంటన్నర చాలనిపిస్తూంది. అనువైన ప్రదేశం వెదకడానికి టైం పడుతుంది కదా" చెప్పాడు బెర్జీ. పార్కే ముఖంలో బెర్జీ చెప్పినదానికి సరేనన్న భావం కనిపించింది.

నిజానికి పార్కే బృందంలో సభ్యులంతా ప్రాథమిక దశలో వున్నవారే. బృందం రెండు మూడు ప్రయాణాలను మించి చేయలేదు కూడా. అందుకే సాగర్, జస్వంత్, బెర్జీలను బృందంలో సభ్యత్వం లేకపోయినా, గతానుభవం కూడా లేకుండానే తమతో పాటు డిజియానా ఆరోహణ చేస్తాననగానే పార్కే మనస్ఫూర్తిగా అంగీకరించాడు. బృందం పెరగడంవల్ల ప్రయాణం సమర్థవంతంగా సాగుతుందనే విశ్వాసం పార్కే కలిగివుండడం అందుకు కారణం కావచ్చు. బృందంలో చేరిన మర్నాడే పార్కేకి బెర్జీ తెలివితేటలు, మనస్తత్వం నచ్చాయి. నిజానికి సాగర్, జస్వంత్ లకు బెర్జీ ఎవరో తెలియదు!

దాదాపు గంటన్నరపైనే నిశ్శబ్దంగా సాగింది

ప్రయాణం. తరువాత పార్థే జెర్రీ తప్ప. మిగతావాళ్ళు తలో దిక్కుకి విడిపడి కుడా రాలకు అనువైన ప్రదేశం వెతకసాగారు. వాళ్ళకు కొద్ది వెనకగా వున్న సాగర్, జస్వంత్ అలాగే నిలబడిపోయారు.

“మిస్టర్ ఫ్రెండ్స్ ఈ ప్రయాణం మీకు కొద్దికష్టంగా వుంది కదూ!?” నవ్వుతూ ప్రశ్నించాడు జెర్రీ. అతడి ప్రశ్న సూటిగా వుంది.

గొంతు సర్దుకొని ముందుకొస్తూ చెప్పాడు జస్వంత్. “నో....నో.. మిస్టర్ జెర్రీ. కొద్ది కొత్తగా ఉన్నప్పటికీ ఉత్సాహంగా వుంది.”

“పార్థే లాంటి అనుభవజ్ఞులతో కలసిరావడంవలన ధైర్యంగా కూడా వుంది” మిత్రుడి మాటకు వత్తాసు పలికాడు సాగర్.

“కొత్తవాళ్ళయినా ఇంతదూరం, ఇంత పైకి యే అలసటా లేకుండా మాతో సమానంగా రాగలిగారంటే మీ సహనానికి మెచ్చుకోవాలి” ప్రశంసనీయంగా చూశాడు పార్థే.

“ఏదో కారణం లేకుండా ఇంత పట్టుదలగా కష్టపడి రారులే!?!”

జెర్రీ మాటలకు మిత్రద్వయ ముఖాల్లో నవ్వు మాయమయింది. ముఖంలో మారే రంగుల్ని బలవంతాన అదుపులో పెట్టుకొన్నారు.

“మిస్టర్ జెర్రీ! మీ మాటలు నాకర్థం కాలేదు?” వీలయినంత ప్రశాంతంగా అడిగాడు జస్వంత్.

“మిస్టర్ జస్వంత్! నా ఉద్దేశ్యం—పర్వతారోహణ బాగా నేర్చుకోవాలనుకొన్నదే మీ పట్టుదలకు కారణం కావచ్చు!”

మిత్రులిద్దరూ నిశ్శబ్దంగా ఊపిరి వదిలారు బెనర్జీ సమాధానంతో.

2

"పార్లేసాబ్ ఇక్కడ బావుంది" వారు నిలబడిన ప్రదేశానికి ఎడం వయిపు, కాస్త దూరంనుండి ఒక వ్యక్తి అరచి చెప్పాడు.

అందరూ అటు తిరిగారు. "వెరీగుడ్! అద్దు కూడా అనువుగా వుంది" సంతృప్తిగా చెప్పాడు పార్క్లే. మరి కాసేపు ఆ ప్రదేశాన్ని పరికించి, "అందరూ అక్కడకు పదండి" అని బిగ్గరగా చెప్పాడు.

అప్పటికే బాగా చీకటిపడింది. ముక్కలు ముక్కలుగా చింపి గాలిలోకి ఎగరేసిన మాదిపింజల్లా మంచు మెల్లగా కురుస్తోంది. ముందు రాబోయే ఉధృతానికి సూచనగా చల్లని గాలులు వుండుండి వీస్తున్నాయి. అందరూ తమ తమ సామానులు విప్పుకొని, గుడారాలు వేయడంలో నిమగ్నమయ్యారు.

బలమైన టార్పాలిన్ గుడ్డతో మిలటరీ గూడారాల వలె వేయబడ్డ మొత్తం ఐదు గుడారాలు గాలి వేగానికి కొద్దిగా కంపిస్తూ మంచులో గుచ్చబడిన ఇనుపఊచల్ని కూడా సన్నగా ఊపుతున్నాయి. నిజానికి అప్పుడు గాలి చాలా బలంగా వీస్తూంది. అయితే వారి గుడారాలు ఎత్తుగా వున్న రెండు మంచు శిఖరాల మధ్య సమతల ప్రదేశంలో వేయుడంవలన గాలి విసురు అంతగా బాధించడంలేదు వాళ్ళను.

పార్క్లేతో సహా మొత్తం సభ్యులు పదహారుమంది. పార్లే బెనర్జీలకు ప్రత్యేకంగా ఒక గుడారం కేటాయించబడింది. మిగతా పధ్నాలుగుమంది నాలుగు గుడా

రాలలో పడుకొన్నారు. అంతా, పొడవైన కాలర్లు వున్న, ఉన్ని జాబ్బాలు తొడుగుకొని వున్నారు.

సాగర్, జస్వంత్ లు ఉన్న గుడారంలో మరో ఇద్దరున్నారు. వాళ్ళ గుడారానికి అక్కడక్కడా కొన్ని చిరుగులున్నాయి. వాటిల్లోంచి, సన్నగా గాలిదూసుకొస్తూ, వాళ్ళు కప్పుకొన్న జాబ్బాల్ని ఛేదించుకొని శరీరాన్ని కొద్దో గొప్పో బాధిస్తూంది.

గుడారంలో వున్న మరో ఇద్దరు అప్పటికే బయటికి వెళుతూ అడిగారు "ఫ్రెండ్స్ మీరు ఫుడ్ కి రారా!?"

ఒక్కసారిగా మిత్రులిద్దరికీ ఆకలి గుర్తొచ్చింది. హుషారుగా లేచి బయటికి వచ్చారు. సాగర్ జాబ్బా కాలర్ని చెవుల పైకి మరింత లాక్కున్నాడు. మధ్యలో వున్న విశాలమైన గుడారంలో మంట వెలుతురు కనబడుతూంది. అక్కడ కొందరు బయటే నిలబడి వణుకుతున్నారు.

ఇద్దరికీ చలికి పళ్ళు గిట్టకరచుకొనిపోతూ చేతులూ కాళ్ళూ వొంకర్లు తిరిగిపోసాగాయి. సాగర్ నడుస్తూ చుట్టూ చూశాడు, చిక్కటి చీకటిలో తెల్లటి మంచు శిఖరాలు చీకటిపడబోయేముందు ఆకాశంలో తేలే మబ్బు తునకల్లా అస్పష్టంగా కనబడుతున్నాయి.

గుడారం లోపలికి చేరుకున్నారు. ఎర్రటి మంట వెచ్చదనాన్ని ఇస్తూంది.

"హల్లో ఫ్రెండ్స్ ఇలా కూర్చోండి" ఆహ్వానించాడు జార్జ్ అప్పటికే చేతిలో వున్న ప్లేటులో యేదో తింటున్నాడతను.

"థాంక్స్!" క్లుప్తంగా అని కూర్చున్నాడు సాగర్. ప్రక్కనే కూలబడ్డాడు జస్వంత్. మంట దగ్గర ఆహారం

తయారుచేస్తున్న నలుగురిలో ఒక వ్యక్తి లేచివచ్చి, ఇద్దరికీ చెరో ప్లేటూ అందించి వెళ్ళిపోయాడు.

సాగర్ ప్లేటును చూశాడు. బాగా వేడిగా వుంది. నాలుగు చపాతీలపై పొగలు కక్కుతున్న బఠానీకూర వేసివుంది ప్లేట్లో. వేడి పుట్టించడానికి అన్ని హంగులున్న ఆహారం. చురుకుగా చపాతీముక్క తుంచి, కూరలో ముంచాడు సాగర్.

"సాగర్ మీది జైపూర్ కదూ!" మాటాతుగా విని పించిన ప్రశ్నకి, నోట్లో పెట్టుకోబోతున్న చపాతీ ముక్కని అలాగే వుంచి, జస్వంత్ వంక చూసి తర్వాత తల పక్కకి తిప్పాడు సాగర్.

చిరునవ్వుతో సాగర్ వంక చూస్తున్నాడు బెనర్జీ.

సాగర్ అవునన్నట్టు చాలా నెమ్మదిగా తలవూపి, మళ్ళీ తన పనిలో నిమగ్నమయ్యాడు.

తాపీగా "నాదీ జైపూరే - అంటే మన బాచ్‌లో జైపూర్ వాళ్ళం ముగ్గురున్నామన్నమాట" అన్నాడు బెనర్జీ, జస్వంత్ వంక చూస్తూ.

"మీదీ జైపూరేనా!?" తాపీగా చూస్తూ ఆశ్చర్యం ప్రకటించాడు జస్వంత్.

బెనర్జీ ముఖంలో మళ్ళీ నవ్వు ప్రత్యక్షమయింది. అతడు మళ్ళీ యేదో అడగబోతున్నాడని గ్రహించాడు సాగర్.

"ప్రొఫెసర్ గురుసింగ్ మీకు తెలుసా?"

ఆ ప్రశ్నకు సాగర్‌కి పొలమారింది. ఇద్దరూ చటుక్కున చూపుల్ని బెనర్జీ ముఖానికి ప్రసరింపజేశారు. మంట వెలుతురు ఎర్రగా ప్రజ్వరిల్లుతుంది బెనర్జీ ముఖంపై, ముఖంలో అతడి కళ్ళల్లో.

మిత్రుల మౌనంచూసి బెనర్జీయే చెప్పాడు ప్రొఫెసర్ గురుసింగ్ మా ఫామిలీకి బాగా ఆప్తుడు. జైపూర్‌లో సాధారణంగా గురుసింగ్ పేరు తెలియని వాళ్ళు ఎవరూ ఉండరు. ఎందుకంటే అతడు వారిల్లోని వ్యక్తి. చరిత్ర కందని విషయాల్ని, చరిత్రకారులు మర్చిపోయిన నిజాల్ని వెలికితీయడంలో దిట్ట ...

బెనర్జీ తమ ముఖాలలో భావాల్ని గమనిస్తున్నట్టు గ్రహించిన సాగర్ చటుక్కున గాజు గ్లాసు అందుకొని కాసిన నీళ్ళు తాగాడు. తర్వాత అడిగాడు "ఇవన్నీ మాకెందుకు చెబుతున్నారు?"

జస్వంత్ చుట్టూ పరికిస్తున్నాడు. ఎవరి ధోరణిలో వాళ్ళు బాతాఖానీ మాట్లాడుకొంటున్నారు.

బెనర్జీ ఆశ్చర్యంగా అడిగాడు "అదేమిటి సాగర్ అలా అంటారు మీ అంకుల్ పేరు ముఖర్జీ కదూ?"

కాసేపు ఊపిరి పీల్చడం మాని, తర్వాత సర్దుకొని చెప్పాడు సాగర్ అయిష్టంగానే "అవును."

"ఆయన మీకు తెలుసా?" ఆత్రంగా అడిగాడు జస్వంత్.

"తెలియకపోవడం యేమిటీ. అసలు మీరిద్దరూ ఈ బృందంతో వెళుతున్నట్టు ఆయనే చెప్పాడు."

"మేమీ బృందంతో ప్రయాణం చేస్తున్నట్టు ముఖర్జీగారే చెప్పారా?!?" ఇక ఆగలేనట్టు ఆశ్చర్యాన్ని వెళ్ళగక్కాడు జస్వంత్ — సాగర్ వారిస్తున్నట్టు కళ్ళతోనే చేస్తున్న సైగలు తనకి చేరకముందే!

బెనర్జీ కళ్ళు తళుక్కున దీపాల్లా మెరిశాయి. స్పష్టంగా అన్నాడతడు "అవును."

3

రాత్రి పదకొండు దాటుతోంది.

సాగర్, జస్వంత్ లిద్దరూ గుడారంలో ఓ మూలగా కూర్చుని రెండు అరచేతులంత ఉన్న కార్డ్‌బోర్డ్ పేపర్ నొకదాన్ని పరిశీలిస్తున్నారు, పైన వేలాడదీయబడిన చిన్న లాంతర్ ప్రసారిస్తున్న గుడ్డి వెలుతురులో.

వాళ్ళతో పాటు ఉంటున్న మరో ఇద్దరు వ్యక్తులు గంటక్రితమే లాంతరు ఆర్పి నిద్రలోనికి జారుకున్నారు.

జస్వంత్ మాప్‌లో ఎడమవయిపునుండి రెండంగుళాల ముందు ప్రదేశాన్ని చూపుతూ చెప్పాడు. "సాగర్ ఈ రోజు సాయంత్రం స్పష్టంగా చూశాను నేను—ఇక్కడ పాయింట్ చేయబడిన రెండు శిఖరాలు మన గుడారానికి అటూ ఇటూ ఉన్న శిఖరాలే....

....జాగ్రత్తగా చూడు మాప్‌లో చూపబడిన శిఖరాలన్నింటిలోనూ చెట్లు వున్న శిఖరాలు రెండే వున్నాయి. వాటికి గుర్తుగా ఈ శిఖరాలకు ఆకుపచ్చరంగు దిద్దబడింది. ఇందులో ఒక శిఖరం మనం చేరవలసిన గమ్యం ఉన్న చోట వుంది. అందుకు గుర్తు. ఈ ఆకుపచ్చ శిఖరం క్రింద అటువైపు కూడలి ప్రదేశం. ఇటువైపు సమతల ప్రదేశం. ఈ సమతల ప్రాంతం దిగువగుండా ఉన్న ఇరుకుమార్గమే మాప్‌లో బాణం గుర్తుతో గుర్తించబడింది. ప్రస్తుతం ఈ మార్గంలో నుండే మనం ప్రొసీడ్ అవ్వాలి."

సాగర్ అంగీకరించినట్టు తల వూపాడు "నువ్వు చెప్పింది కరెక్టే జస్వంత్! ముఖర్జీ అంకుల్ చెప్పినదాన్ని బట్టి. ఈ బృందం వెళ్ళే దారిలోనే మన గమ్యం చేరడానికి మార్గం తెలుస్తూంది—నిజానికి అందుకే కదా, మనం ఒంటరిగా వెళ్ళకుండా ఈ బృందంతో కలిసాం"

అన్నాడు.

"అయితే ఈ రాత్రే కట్టుచప్పుడుకాకుండా మనం బృందంనుండి వైదొలగడం మంచిది" చెప్పాడు జస్వంత్.

ఉన్నట్టుండి చటుక్కున కదిలాడు సాగర్!! అతడు గుడారం చివర బాగ్‌కి ఆనుకొని కూర్చున్నాడు అంత వరకూ! గుడారానికి ఉన్న చిన్న రంధ్రంలోనుండి చలి గాలి సూటిగా అతడి వడి చెంపను కొడుతుంది అంత వరకూ.

అయితే చిత్రంగా అది సుమారు నాలుగైదు క్షణాల నుండి ఆగిపోవడమేకాక, పూర్తిగా అటునుండి గాలి వేయకపోవడంతో అక్కడ యెవరో రంధ్రంలోనుండి చూస్తున్నట్టు అనుమానించాడతడు!!

గుడారం వెలుపలికి వచ్చి నాలుగడుగులు వేగంగా ముందుకు నడిచి చూశాడు. దూరంగా యేదో ఆకారం అప్పటికే లీలగా నెమ్మదిగా చీకట్లో కలసిపోయింది!!?

"ఏమయింది?" తనూ వచ్చి అడిగాడు జస్వంత్.

"ఎవరో మన మాటలు విన్నారని అనుమానంగా ఉంది."

"మనల్ని అనుమానించవలసిన అవసరం ఎవరికి వుంది. అసలు అనుమానం కలిగే విధంగా యే కోశానా మనం ప్రవర్తించలేదు" నమ్మకంగా చెప్పాడు జస్వంత్.

"భైరజీ విషయం మర్చిపోతున్నావు!" సాలోచనగా అన్నాడు సాగర్.

"అతడు మనం అనుకొన్నంత ప్రమాదకారి కాదేమో!?"

"సరే! ఏదియేమయినా యెలాంటి ఆపదనయినా ఎదు ర్కొనడానికి మనం సిద్ధంగా వుండాలి. ఇక నిద్ర

పోదాం. తెల్లవారుజామునే లేవాలి మళ్ళీ" అంటూ నడిచాడు సాగర్.

తెల్లవారుజామున నాలుగు దాటింది—

ఉలిక్కిపడి లేచాడు సాగర్. చుట్టూ చూశాడు. జస్వంత్ కనిపించలేదు. అతడి పొదడు శూన్యమై పోయింది. సామగ్రి అంతా అక్కడే వుంది.

ఇంతలో గుడారం కర్టెన్ తొలగించుకొని ఒక ఆకారం లోనికి వచ్చింది. సాగర్ ఏదో అనబోతుండగా "సాగర్ నాలుగు దాటింది. బయట ఎవరూ లేరు. త్వరగా రెడీ అవు!" హెచ్చరించాడు జస్వంత్.

సాగర్ ఊపిరి వదిలి ఐదు నిమిషాల్లో బధకం వదిలించుకొని రెడీ అయ్యాడు. వాళ్ళిరువురుగా పడుకొన్న ఇద్దరు వ్యక్తులు గాఢ నిద్రలో వున్నారు. హేండ్ స్టిక్ అందుకొని గుడారంలో నుండి బయటికి వచ్చాడు సాగర్. అంతకుముందే తయారయ్యాడు జస్వంత్. ఇద్దరూ సామాగ్రి చెరిసగం వీపులకు బిగించుకొన్నారు.

"జస్వంత్, ఫుడ్ టిన్స్ నీ దగ్గర ఉన్నాయా" గుసగుసగా అడిగాడు సాగర్.

"వున్నాయి" చెప్పాడు జస్వంత్. చాలా అస్పష్టంగా వెలుతురు ఉంది బయట. ముందుకు నడిచారిద్దరూ. ప్రతి అరగంటకు మాప్ చూసుకొంటూ దాదాపు ఎనిమిది గంటలు ప్రయాణం చేశారు.

అప్పటికే వాతావరణం కొద్ది వెచ్చబడింది. పరిసరాలు స్పష్టంగా ఆహ్లాదంగా వున్నాయి.

సాగర్ టైమ్ చూశాడు. పన్నెండు దాటింది. అప్పటికే చాలావరకూ గమ్యం చేరారిద్దరూ.

మేప్‌లో వాళ్ళున్న పరిసరం ఎర్రటి రంగుతో సర్కిల్ చేయబడి వుంది.

4

“జస్వంత్ అసలా నిధి నిజంగా వుందంటావా లేక పోతే ఇదంతా పుక్కిటిపురాణం లాంటిదా?!”

జస్వంత్, సాగర్ వంక ఆశ్చర్యంగా చూశాడు.

“ఇంత దూరం వచ్చాక నీకీ సందేహం రావడం వింతే! గురుసింగ్ వంటి మేధావి పరిశోధనలో బయల్పడిన అద్భుత రహస్యం ఇది. ఇక్కడున్న సంపద, అంకుల్ ముఖర్జీ మనకు చెప్పిన దానికంటే తక్కువ వుంటే వుండవచ్చు — కానీ, అసలు లేకపోవడం అనేదిమాత్రం జరగదని నా నమ్మకం.”

“మనం తీసుకొన్న ఇంత రిస్కుకి సరైన ఫలితం దక్కాలన్నదే నా తాపత్రయం కూడా” విపరీతమైన చల్లదనానికి కమిలిపోయిన సాగర్ ముఖంలో అలసట స్పష్టంగా కనబడుతూంది. మరికొంత దూరం నడిచారు నెమ్మదిగా.

అక్కడి ప్రదేశాన్ని ఓసారి పరీక్షగా కలియ జూశాడు జస్వంత్. సాగర్ టెన్షన్‌గా చూస్తూ ఆలోచిస్తున్నాడు.

ఎత్తయిన ఓ శిఖరం పైనుండి ఎండ వేడికి మంచు కరుగుతూ నీటిధార చిన్న చప్పుడుతో క్రిందికి వస్తూంది. క్రిందికి రాగానే అది రెండుగా చీలి శిఖరం దిగువ లోయలోనికి జారిపోతూంది. ఆ లోయ అంచునే ఉన్నారు జస్వంత్, సాగర్‌లు.

వాళ్ళకు కుడివైపు బాగా ఎత్తుగా విశాలంగా పేరు కొని పోయిన మంచు తిన్నెపై గుబురుగా అల్లుకొని

పోయాయి పచ్చటి చెట్లు. సర్వ సాధారణంగా మంచు లోనే పెరుగుతాయవి

"సాగర్ అటు చూడు!!" ఆనందంతో వణికే స్వరంతో చెప్పాడు జస్వంత్.

అప్పటికే సాగర్ కనిపెట్టాడది. వెంటనే సంతో షంతో తల ఊగిస్తూ చేతిలో మాప్ ను మరోసారి చూశాడు. ఎర్రటి సర్కిల్ చేయబడిన ప్రాంతంలో కుడి వైపు మూలగా సన్నటి ఇంగ్లీష్ కేపిటల్ అక్షరాలు స్పష్టంగా వ్రాయబడి వున్నాయి 'CAVE' అని....

కాసేపాగి ఇద్దరూ నిశ్శబ్దంగా నడిచా రక్కడికి. చెట్ల గుబురు మధ్యనుండి లోపలికి చూస్తే, చీకటి నల్లరంగు పులిమినట్టుంది. చెట్లు పొదలు తొలగించుకొని గుహ లోపలికి నడిచారు. "మైగాడ్! ఇంత చీకటా!?" అంటూ బ్యాటరీలైటు తీసి వెలిగించాడు సాగర్.

మరుక్షణం చీకటి ప్రదేశం లైటు ప్రసరించిన మేరకు వెలుగు చూసింది. నల్లటి మట్టి చమ్మగా వుంది. మంచు కరిగిన నీళ్ళుకూడా దానికి తోడవడంతో, పైభాగానున్న మట్టిపలకలనుండి నీరు బొట్లు బొట్లుగా కారుతోంది. నేలంతా బురదగా మారుతూంది అక్కడక్కడా!!

ముందున్న విశాలమైన ప్రదేశంలో, ఇద్దరూ ఒకరి చేయి మరొకరు పట్టుకొని ముందుకి పోసాగారు. వాళ్ళ లెదర్ షూస్ దాదాపు మూడు అంగుళాలవరకూ బుర దలో మునిగిపోతున్నాయి!

"సాగర్, బీ కేర్ ఫుల్! ఇలాంటిచోటే ఊబులు తయారవుతుంటాయి" హెచ్చరించాడు జస్వంత్.

ఇద్దరూ పదిహేను అడుగులు పొడవున్న ఆ ప్రదే శాన్ని అతి జాగ్రత్తగా దాటసాగారు.

సాగర్ చేతిలో లైటును గుహంతా తిప్పసాగాడు. అతడి చేయి మెల్లగా ఆగింది! అక్కడినుండి లైటుకాంతి పడేచోట సన్నగా పొడుగ్గా వున్న సొరంగమార్గం కనిపిస్తూంది. ఇద్దరూ కొద్దిక్షణాలు ముఖాముఖాలు చూసుకొన్నారు.... మెల్లగా అటు కదిలారు.

సందులా వున్న ఆ మార్గంలోనికంటా కాంతిని ప్రసరింపజేశాడు సాగర్. పొరలు పొరలుగా చీలిపోయివున్న నల్లమట్టి ప్రదేశం అదంతా. సహజసిద్ధంగా ఏర్పడినది.

ఎంతో దూరం లేదా మార్గం. ఐదారు అడుగులు నడిచేసరికి, ముందున్న ప్రదేశంపై యేదో అస్పష్టమైన వెలుతురు పడుతుందని క్రమంగా అర్థమైంది వాళ్ళకు. బ్యాటరీ లైటు వెలుతురు కాదది?!

సొరంగం మార్గం అంతమయింది. ఈసారి దగ్గరగా చూశాడు. వెలుతురు తునకలు యొక్కడినుండో వాళ్ళకెదురుగా ఉన్న ప్రదేశంపై పడుతున్నాయి. లైటు ఒకసారి చుట్టూ తిప్పాడు సాగర్. ఆ కొద్దిసేపటిలోనే అదొక చిన్న గుండ్రటి ఇరుకు స్థలమని గ్రహించారు.

సాగర్ కనుబొమ్మలు ముడిపడ్డాయి. మళ్ళీ లైటుతిప్పి "జస్వంత్ చూశావా!" అన్నాడు. వింతగా ధ్వనించింది అతని కంఠం. ఆశ్చర్యకరమైన దృశ్యం చూసినవాడిలా.

జస్వంత్ ముందుకు వంగాడు.

లైటుకాంతి పడినచోట, రెండడుగుల లోతున రాతి విగ్రహం ఒకటి పాతుకొనిపోయి వుంది మట్టిలో.

లైటును కొద్దిగా కదిపాడు సాగర్. అతడికి వినిపించిందో ధ్వని—బుస్సు...మనే ధ్వని అది.

జస్వంత్ కూడా విన్నాడది. "సాగర్!!" అంటూ

ఆర్పాడు కంగారుగా.

త్రుళ్ళిపడిన సాగర్ అప్రయత్నంగా వెనక్కి వంగాడు.

5

ఏదో గట్టిదనం వున్న మెత్తటి వస్తువు సాగర్ చేతిలో బ్యాటరీలైటును బలంగా తాకింది! చిన్న శబ్దంతో లైటు అద్దం పగిలి విరిగిపోయింది. వెంటనే ఆరి పోయిందది.

అంతా గాఢాంధకారం!! ఇద్దరూ భీతితో రెండడుగులు వెనక్కి వేసి అలాగే వుండిపోయారు కాసేపు. ఆ చీకటి ప్రదేశంలో సర్పాలు వున్నాయనే నిజాన్ని క్రమక్రమంగా జీర్ణించుకోసాగారు.

ఇద్దరికీ కళ్ళు లాగుతున్నాయి ఆ చీకటికి. జస్వంత్ చూపులు వెలుగురేఖలపై పడ్డాయి. "ఓహ్.... గాడ్" అప్రయత్నంగా అన్నాడు. సాగర్ చటుక్కున అటు చూశాడు. ఒళ్ళు జలదరించిందతనికి, పూర్తిగా చూడగానే!?

రాతివిగ్రహం పరిసరాలలో పైభాగంనుండి కొన్ని కాంతికిరణాలు దూసుకొని పడుతున్నాయి. వాటి అస్పష్ట కాంతిలో అనేక సర్పాలు బిరుసైన పొడలతో తాపీగా కదులుతున్నాయి!!

"కొంచెం వుంటే ప్రాణంపోను-బహుశా పైభాగాన ఎక్కడో ఓపెన్‌గా ఉండివుంటుంది. అందుకే ఈ వెలుతురు" స్వగతంగా చెప్పాడు సాగర్. జస్వంత్ మాట్లాడలేదు. అతడింకా పాముల్ని క్రీగంట అసహ్యంగా చూస్తూనే వున్నాడు.

సాగర్ లైటును తడిమాడు. అద్దం రెండుగా బద్ద లయి పైభాగమంతా ముక్కలు ముక్కలుగా క్రిందికి

రాలిపోయి వుంది. వేళ్ళను లోపలికి పోనిచ్చి తడిమాడు. రిలీఫ్ గా నిట్టూర్చాడు. ప్రాణం లేచివచ్చినట్టయింది అతడికి.

"బల్బ్ పగిలిందా?" ఆత్రంగా అడుగుతున్నాడు జస్వంత్.

"లేదు" క్లుప్తంగా చెప్పి వేళ్ళతో బల్బును అటూ ఇటూ తిప్పాడు.

చటుక్కున వెలిగింది బల్బు! కాని ఈసారి కాంతి మునుపటిలా లేదు.

ఊపిరి వదిలి చెప్పాడు జస్వంత్ "అదృష్టవంతులం" లైటు మసక వెలుతురులో అతడి ముఖంపై చెమట బిందువులు చూశాడు సాగర్.

"ఇప్పుడెలా?" భయంగా అడిగాడు జస్వంత్.

సాగర్ ఆలోచించి చెప్పాడు. "మన దగ్గర తాడు బయటికి తియ్."

జస్వంత్ మారు మాట్లాడకుండా వీపుకున్న బాగ్ విప్పి సన్నటి తాడుతీసి అందించాడు. సాగర్ తన బాగ్ లోనుండి పర్వతారోహకులు వాడే 'ఏంచర్'లాంటి సాధనంతీసి తాడుకు ముడివేశాడు.

జస్వంత్ అయోమయంగా చూడసాగాడు బ్యాటరీ లైటు అందుకొని.

"ఆ విగ్రహమే మన టార్గెట్ ను సూచిస్తూందని నా అనుమానం___ముందు దాన్ని అక్కడనుండి కదిపితేగాని యే విషయం బయల్పడదు" చెప్పాడు సాగర్.

జస్వంత్ లైటు విగ్రహం మీదికి ఫోకస్ చేసి పట్టుకున్నాడు. కాంతి యెక్కువగా లేకపోవడంవల్ల మసగ్గా కనబడుతూంది విగ్రహం. ఇద్దరూ కాస్త వెనగ్గా నిల

బడ్డారు యెందుకయినా మంచిదని.

సాగర్ తాడును కొద్దిగా తిప్పుతూ విగ్రహంమీదికి విసరసాగాడు. ఏడవసారి అతడి ప్రయత్నం ఫలించింది. విగ్రహానికి ఆశీర్వదిస్తున్నట్లు ఒక చేయి ముందుకొచ్చి వేసుగా వుంది. ఏంకర్ సరిగ్గా అక్కడ తగులుకొంది.

"నెమ్మదిగా లాగు. విరిగితే ప్రమాదం" హెచ్చరించాడు జస్వత్.

సాగర్ జాగ్రత్తగా లాగసాగాడు తాటిని. విగ్రహం కూరుకుపోయి వున్నది కేవలం నల్లమట్టిలోనే కావడంవల్ల మరికాస్త గట్టిగా లాగేసరికి, పూర్తిగా వెలుపలికి వచ్చేసిందది.

విగ్రహం బయటికి రాగానే ఇద్దరి కళ్ళూ అది కూరుకొనిపోయినచోట చటుక్కున పడ్డాయి.

వెంటనే ఇద్దరి ముఖాలు కళావిహీనం అయ్యాయి!?! అక్కడేమీ లేదు. మసక వెలుతురులో మట్టి కనబడుతుందంతే!

చేతిలో తాడును కొద్దిగా లాగాడు కదల్లేదు అది. పాముల బుసలు స్పష్టంగా వినిపిస్తున్నాయి.

సాగర్ కి ఆశ్చర్యం వేసింది. విగ్రహం అంత బరువా?!! రెండు చేతులతో బలంగా లాగాడు కొద్దిగా కదిలింది. ఈసారి ఇద్దరూ కలసి లాగసాగారు. మెల్లగా వాళ్ళ ముందుకు వచ్చిందది.

కాసేపు విగ్రహాన్నంతా తడిమారు. ఏ ఆధారం దొరకడంలేదు. హఠాత్తుగా సాగర్ చూపులు విగ్రహం కంఠంమీద పడ్డాయి. చారలా వుందక్కడ.

"జస్వత్ విగ్రహాన్ని గట్టిగా పట్టుకో కదలకుండా" అని చెప్పి విగ్రహం తల, రెండు చేతుల మధ్య బిగించి

తిప్పాడు బలంగా—ఆ భాగం మరలా తిరిగి మూతవలె ఊడివచ్చేసింది.

"వారే!?!" ఆనందంతో ఒడలు పులకించగా అర్చాడు జస్వంత్. టార్చి వెలుతురు విగ్రహం కంఠం లోపలికి వేసి చూస్తూ.

సాగర్ శరీరం ఉద్వేగంతో కూడిన ఆనందంతో కంపిస్తూంది సన్నగా.

విగ్రహం లోపలినుండి అక్కడక్కడా మెరుస్తున్నాయి వజ్రాలు!! కొన్ని మట్టి కొట్టుకుని వున్నాయి.

"ఫలితం దక్కింది-మనం ఇక్కడినుండి ఎంత త్వరగా బయటపడితే అంత మంచిది" కంగారు పెట్టాడు జస్వంత్.

సాగర్ విగ్రహం తల యథావిధిగా బిగించి తాడు రెండు కొసలు రెండు వైపులా వచ్చేలా చేసి బిగించి కట్టాడు. చెరోవయిపూ తాడు పట్టుకొని మోస్తూ వెలుపలికి వచ్చేశారు.

"సాగర్ బాగ్ ఒకటి ఖాళీచేసి నిధి అంతా అందులో సర్దేస్తే" అడిగాడు జస్వంత్.

వప్పుకోలేదు సాగర్. "సామానుకే బాగ్‌లు చాలడం లేదు. అంతగా కావాలంటే పర్వతం దిగిపోయాక ఓ బాగ్‌లో సామాగ్రితీసి అందులో సర్దేసి విగ్రహం పడేద్దాం. ఎవరికీ అనుమానం రాకుండా కూడా వుంటుంది" చెప్పాడు.

టైమ్ ఒంటిగంటన్నర అవుతూంది. మిత్రులిద్దరూ విగ్రహాన్ని కాసేపు మోస్తూ కాసేపు మంచులో ఈడుస్తూ దిగుతూనా పర్వతాన్ని అవరోహించసాగారు.

క్రమంగా చీకటి పడింది—

గుడారం వేయడానికి మంచి చోటుచూసి ఆగా రిద్దరూ. కాసేపటిలో గుడారం తయారయింది. చలి గాలులు ఉధృతం అవుతున్నాయి.

నిద్రలేకపోవడం, దానికి తోడు విపరీతంగా శరీరం అలసిపోవడంవల్ల నిద్రముంచుకొనిపస్తూంది సాగర్ కి. విగ్రహం ఒక మూలగా వుంచి ఫుడ్ టిన్నులు బయటకుతీసి భోజనాలు ముగించారు. పక్కలు వేసుకుని టార్పాలిన్ దుప్పట్లు కప్పుకున్నారు గుడారం చలి గాలులనుండి వాళ్ళను కాపాడటమే కాకుండా వెచ్చదనాన్ని కూడా ఇస్తూంది.

జస్వంత్ అప్పటికే ఆవలిస్తున్నాడు.

సాగర్ ఎడంచేయి ఎయిర్ పిల్లో క్రిందికి దూర్చి సుఖంగా నిద్రలోనికి జారిపోయాడు!

అలా ఎంతసేపు గడిచిందో అతడికే తెలియదు!

ఉండుండి అతడి కనురెప్పలు కొద్దికొద్దిగా తెరచు కొంటున్నాయి!! కళ్ళు తెరవడానికి ప్రయత్నిస్తున్నాడు సాగర్ !!?

నిద్ర మత్తు అతడిపై స్వారీ చేస్తూంది. బలవంతంగా కళ్ళు తెర్చి తలవిదిలించాడు...

హఠాత్తుగా తలగడతో పాటు అతడి చేయి పైకి లేచిపోవడంవల్ల. చటుక్కున చేయి లాక్కుని మోకాళ్ళపై పైకిలేచి చూశాడు.

ఆశ్చర్యంతో అతడి నిద్రమత్తు వదిలిపోసాగింది. కళ్ళు పత్తికాయల్లా విచ్చుకున్నాయి.

6

"జ....స్వం....త్ ...." కరిణత్వం ధ్వనిస్తూ ఉరి మింది సాగర్ కంఠం. జస్వత్ చూపులు వాడిగా

కనిపిస్తున్నాయి సాగర్ కి.

జస్వంత్ చేయి విసురుగా కదిలింది. రెండుక్షణాల క్రితమే శత్రువు చేతిలో కత్తి చూసి వుండడం చేత, చురుకుగా ప్రక్కకి కదిలాడు సాగర్.

ఎడమ భుజం క్రింద నాటుకొంది కత్తి. కీచుమని అర్చాడు సాగర్ బాధతో. రక్తంతో తడిసిపోతోంది అతడి భుజం.

జస్వంత్ డేగలా చూస్తూ వణుకుతున్న చేతులతో జేబుల్లో వెదుకుతున్నాడు.

ఆలస్యం చేస్తే ప్రాణాలు దక్కవని గ్రహించాడు సాగర్. అతడి చేతులు యంత్రంలా కదిలాయి. రివాల్వర్ ప్రత్యక్షమయింది చేతుల్లో. మరుక్షణమే పెద్ద శబ్దంతో పేలింది కూడా.

ధ్వనికి రివాల్వర్ పట్టుకొన్న సాగర్ కుడిచేయి పెద్దగా కంపించింది. ఆ వూపుకి కొద్దిగా వెనక్కు తూలాడతను.

బిగ్గరగా అర్చాడు జస్వంత్. అతడి కాళ్ళూ చేతులు చలనరహితం అయిపోయాయి. సాగర్ కి అంతా అయోమయంగా కంగారుగా వుంది. బుల్లెట్ జస్వంత్ కి ఎక్కడ తగిలిందో అర్థం కావడంలేదతడికి.

రివాల్వర్ గట్టిగా పట్టుకొని పరీక్షగా చూశాడు ముందుకి. జస్వంత్ క్రింద పడివున్నాడు. రెండు చేతులు బొడ్డు ప్రక్కన అదుముకొంటూ మూలుగుతున్నాడు. అతడి చేతుల్లో నుండి ఉబుకుతోంది రక్తం, పొట్టంతా ఎర్రగా తడిసిపోయి వుంది.

రెండో బుల్లెట్ పేల్చే అవసరం లేదని గ్రహించాడు సాగర్!

కాసేపటికి జస్వంత్ మూలుగు ఆగిపోయింది, అతడి శరీరం నిర్జీవమయింది!!

సాగర్ తన ఎడంచేయి చిటికెన వేలికి తగులుకొని వున్న తాడును తెంపాడు. జస్వంత్ మన స్తత్వంపై సాగర్ కి ముందునుండీ అనుమానమే. అందుకే పడుకో బోయేముందు, విగ్రహానికి కట్టిన తాడు నుండి సన్నటి పోగును కొద్దిగా లాగి చిటికెన వేలికి ముడివేసుకొని, విగ్రహం నుండి తాడును బిగుతుగా లాగి పడుకొన్నాడు.

జస్వంత్ విగ్రహాన్ని కదపడంతో ప్రత్యక్షంగా పట్టు బడిపోయాడు.

మోకాలిపై అలాగే కూర్చుని యించుమించు పావు గంట గాయానికి కట్టుకట్టుకొని, అలాగే వుండిపోయాడు సాగర్ చాలాసేపు.

చుట్టూ విశాలమయిన గాఢాంధకారం! సుద్దిగా వెలు గుతున్న బ్యాటరీలైటు వెలుతురులో మెరుస్తున్న వజ్రాలు! కాంతులీనే బంగారం! నగలు! మరికాస్త వెలుగును సృష్టి స్తున్నాయి. వాటి ప్రక్కనే కొయ్యలా బిగుసుకున్న శవం!! వెలుతురు కొంత అస్పష్టంగా జస్వంత్ ముఖంపై పడుతోంది.

ఇక భరించలేకపోయాడు సాగర్.

రివాల్వర్ జేబులో భద్రపర్చి, శవం రెండు కాళ్ళూ పట్టుకొని గుడారం వెలుపలికి వచ్చాడు.

వణికే అతడి శరీరాన్ని గాలి చల్లగా, వేగంగా స్పృశిస్తూ మరింత వణికిస్తోంది. అతడి గుండె చప్పుడు పెరిగింది అప్రయత్నంగా!

గుడారానికి పదడుగుల దూరంలో వాలుగా మంచు కోయబడివున్న పల్లపు ప్రదేశం వుంది. శవాన్ని అక్కడికి

లాక్కొనిపోయి క్రిందికి దొర్లించాడు. పెద్ద లోతయిన పల్లపు ప్రాంతము కాదది.

జస్వంత్ శవం నాలుగుసార్లు దొర్లి ఆగిపోయింది.... కళ్ళు తెరుచుకొనే వున్నాయి! చూపులు సూటిగా సాగర్ వైపే వున్నాయి. చనిపోయే ముందు అతడి చూపులో క్రూరత్వం ఇంకా పోలేదు!!

వెన్ను జలదరించగా భారంగా నిట్టూర్చి లోపలికి వచ్చాడు సాగర్. జస్వంత్ బాగ్ లోనికి కొంత నిధి సర్దివుంది. విగ్రహం నేలమీద పడివుంది. మిగిలిన నిధి కూడా అదే బాగ్ లోనికి చేరవేసి, విగ్రహాన్ని తల బిగించివేసి దానిని కూడా అదే పల్లంలోకి విసిరేశాడు.

భుజంపై గాయం ఉండుండి భగ్గుమంటోంది. చేయి కదలడం కష్టంగా వుంది. కట్టు మరికాస్త గట్టిగా బిగించాడు. నిద్రమత్తు ఊపుతోందతడిని.

వడివైపుకి ఒరిగి పడుకొన్నాడు పక్కపై. నిస్సత్తువగా అలసటగా వుంది సాగర్ కి. ముందు కారిన రక్తం, ఇంకా జబ్బపై ఆరలేదు. తడితడిగా వుంది.

కళ్ళు మూసుకొన్నా నిద్ర రావడంలేదు. జస్వంత్ శవం తనవైపే సూటిగా చూస్తున్న దృశ్యం ప్రత్యక్షమై అతడి గుండె వేగాన్ని పెంచుతోంది. కళ్ళు తెరిచాడు భరించలేక. అయినా అదే దృశ్యం!!

ఆ రాత్రి అతడికి కాళరాత్రే అయింది.

7

మర్నాడు రాత్రి ఏడున్నర అవుతోంది—

చీకటి మంచుపర్వతశ్రేణుల క్రిందవున్న ఆ పట్టణాన్ని చుట్టుముట్టి వుంది.

విశాలమైన వీధులలో జనసంచారం యెక్కువగా

వుంది. అన్నిచోట్లా దీపాలు వెలిగివున్నాయి. మంచు పేరుకొనిపోయి వుంది కొన్నిచోట్ల. వేళ్ళు కూడా కనబడనటువంటి వేషధారణలో ఉన్న జనం మెల్లగా సంచరిస్తున్నారు.

అక్కడున్న ప్రతి వీధిలోనూ కనీసం ఇద్దరయినా పర్వతారోహకుల దుస్తులలో వున్నారు. కాని అలాంటి వారిని అక్కడెవరూ వింతగా చూడరు. రోజూ యెన్నో బృందాలు, ఎంతోమంది టూరిస్టులు అక్కడికి రావడం బస చేయడం మామూలే!

ఒకచోట రోడ్డుపై ఎత్తుగా 'ఎంబ్రాస్ లాడ్జి అండ్ హోటల్' అని నీలంరంగు లైట్లతో సొగసుగా అమర్చబడి వుంది. అతి ఖరీదయిన హోటల్ అది. అందులో నాలగవ అంతస్తులో, నూటరెండు నెంబర్ గల గదిలో, ఎరుపు తెలుపు మిళితమైన కాంతిగల పల్చటి లైటు వెలుతురు ఆ గదికి సంబంధించిన నాలుగు విశాలమైన అద్దాలపై పడి వింతగా మెరుస్తోంది.

ఆ గదిలో హీట్ రూమ్‌లో వెచ్చటి పరుపుపై హాయిగా పడుకొని వీడియోలో బ్లూఫిల్మ్ చూస్తూన్నాడు సాగర్! చేతిలో పొట్టిగా గుండ్రంగా వున్న గాజు గ్లాసులోని ద్రవాన్ని తాపీగా తాగుతున్నాడు. అంతక్రితమే డాక్టర్ వచ్చి అతడి చేతికి కట్టుకట్టి, ఇంజెక్షన్ ఇచ్చి వెళ్ళాడు.

హీటర్ లీలగా శబ్దం చేస్తోంది. సాగర్ మౌనంగా ద్రవాన్ని సిప్ చేస్తూ చూస్తోన్నాడు ఫిల్మ్‌ను. గ్లాసులోని ద్రవం కానీ బ్లూఫిల్మ్ కానీ తమ ప్రభావాన్ని అతడిపై యేమాత్రం చూపలేకపోతున్నాయి. బాగ్‌లో దాచిన సంపద చుట్టూనే అన్యమనస్కంగా తిరుగుతున్నాయి.

అతడి ఆలోచనలు.

చేతిలో గ్లాసు టేబుల్ పై వుంచి ఫోన్ రిసీవర్ ఎత్తి యేదో నెంబర్ తిప్పాడు.

కాసేపు నిశ్శబ్దం.

అవతల చప్పుడయింది. ఎవరో రిసీవర్ యెత్తారు బహుశా ముసలి నౌఖరు అలీ అయ్యుంటాడు.

వెంటనే అడిగాడు "హాలో .... ముఖర్జీ గారు వున్నారా?"

కాసేపాగి కంఠం వినిపించింది. "తమ రెవరు బాబూ?"

'వాడే, నౌఖరు అలీ' అనుకొన్నాడు సాగర్, జాగ్రత్తగా గొంతు, భాష గుర్తుపట్టి.

"ముఖర్జీ గారుంటే పిలువ్" అసహనం ధ్వనించేలా చెప్పాడు.

బాగా దూరంనుండి మాట్లాడడంవలన అలీ తనను గుర్తుపట్టలేకపోతున్నాడని గ్రహించాడు సాగర్.

"ఆయన లేరు బాబూ!"

"ఎక్కడి కెళ్ళారు?"

"పోలీసులు అరెస్టు చేసి తీసికెళ్ళిపోయారు బాబూ...."

ఊపిరి పీల్చడం ఆపాడు సాగర్. అతడి కనుబొమ్మలు దగ్గరయ్యాయి.

"ఎప్పుడు?" అతడి స్వరంలో ముందున్న గాంభీర్యం లేదు.

"ఐదురోజులు అవుతుంది బాబూ—ఇంతకీ తమ రెవరు బాబూ!?"

"ఐదురోజులవుతుందా!" స్వగతంగా అనుకొన్నాడు

సాగర్. "పోలీసులు వస్తోన్నారా ఇంటికి, వెతుకుతున్నారా ఇల్లు."

"అవును బాబూ! ఎవరయినా ముఖర్జీ బాబు గురించి అడిగితే వాళ్ళు యేమేం మాట్లాడేరో చెప్పమని కూడా చెప్పారు బాబూ నాకు."

"అంటే ఇప్పుడు నే నడిగినదంతా చెపుతావా పోలీసులకు!"

"అందుకే కదా బాబూ మీ రెవరని అడుగుతున్నాను. చెప్పు...."

మెల్లగా రిసీవర్ క్రెడిల్ చేశాడు సాగర్. వేళ్ళతో నుదుటిమీద గట్టిగా రాసుకొంటూ ఆలోచిస్తూ వుండి పోయాడు చాలా సేపు.

ఐదురోజుల క్రితమే ముఖర్జీ గారిని అరెస్టు చేశారంటే తాము బయలుదేరిన మర్నాడే ఆయన పోలీసులకు దొరికి పోయాడన్నమాట. తమ గురించి కూడా పరిశోధన జరుగుతోందని మెల్ల మెల్లగా అవగాన అయింది అతడికి.

పోలీస్ డిపార్టుమెంట్ చురుకుదనానికి కొద్ది భయం వేసింది సాగర్ కి. అకస్మాత్తుగా అతడికి బెనర్జీ గుర్తొచ్చాడు. అతడు డిపార్టుమెంటుకు సంబంధించిన వ్యక్తి కావచ్చునేమో అని అనుమానం కూడా వచ్చింది.

అంకుల్ ముఖర్జీ పోలీసులకు దొరికిపోయాడు. అతడి ప్లాటే అతడు పడతాడు. ప్రస్తుతం తను చేయవలసిన పని నిధిని కాష్ గా మార్చడం. తనను యే పోలీసులు అనుమానించని, గుర్తించని ప్రాంతానికి వెళ్ళిపోయి కోటీశ్వరుడిగా స్థిరపడగలిగితే తనను మించిన అదృష్ట వంతుడు లేడు!!

రేడియో ఆఫ్ చేసి పక్కనున్న ఇంటర్ కమ్ నొక్కాడు. అతడు రూమ్ నెంబర్ చెప్పవలసిన అవసరంలేదు. ప్రతీ రూమునుండి సెపరేట్ గా ఇంటర్ కమ్ కనెక్షన్స్ వుంటాయక్కడ.

"యస్ సర్!" మృదువుగా వినిపించింది ఓ స్త్రీ కంఠం.

"మేడమ్! సర్వెంటుని పైకి పంపండి, లగేజ్ వుంది. నేను బయటికి వెళ్ళాలి" ఇంగ్లీషులో చెప్పాడు.

"వన్ మినిట్ సర్!" వినయంగా చెప్పింది.

అతడు రెడీ అవుతూండగా సర్వెంట్ వచ్చాడు. సాగర్ సోఫా ప్రక్కన దళసరి క్లాత్ తో తయారు చేయబడిన ఎర్ర పువ్వులున్న బాగ్ చూపించాడతడికి.

సర్వెంట్ బాగ్ అతి కష్టంమీద పైకెత్తాడు. బాగ్ పట్టుకొన్న వైపు ఒరిగిపోయి నత్తలా నడుచుకొంటూ వెళ్ళిపోయాడు. పాత బాగ్ ఒకటి రెండుచోట్ల ఓపెన్ గా కనబడడంతో దానికంటే కొద్ది పెద్దసైజు పువ్వుల బాగ్ తెప్పించి దానిపై కవరులా తొడిగాడు సాగర్.

ఐదునిమిషాల్లో ఖరీదైన డ్రసులో రెడీ అయి కుడివైపు జేబు తడుముకొన్నాడు ఓసారి!

అంతకు ముందే ఐదు వజ్రాలు విడిగా తీసి జేబులో ఉంచుకొన్నాడతడు. రూమ్ లాక్ చేసి బయటికి నడిచాడు.

లిఫ్ట్ గి క్రిందికి వచ్చాడు సాగర్. టాక్సీలో బాగ్ వుంచి అక్కడే నిలబడి వున్నాడు సర్వెంట్.

సాగర్ కి తెలుసు బాగ్ టాక్సీలో చేర్చడానికి సర్వెంట్ ఎంత కష్టపడి వుంటాడో. ఇద్దరు మోయ

తలపిన బరువు అది.

టాక్సీలో కూర్చుంటూ, కొన్ని నోట్లు సర్వెంట్ చేతిలో పెట్టాడు సాగర్. సర్వెంట్ కళ్ళు చిరునవ్వు నవ్వుతున్నాయి.

డోర్ వేస్తూ చెప్పాడు డ్రైవరుకి "జ్యూయలరీ సెంటరుకి పోనీ—"

వేగంతో కదిలింది టాక్సీ.

సాగర్‌కి కొంత బాధగా వుంది. తను డబ్బు ఎక్కువగా ఖర్చుపెట్టేస్తున్నానని. లాడ్జిలో రూమ్‌కి రెండు వేలు అడ్వాన్స్ కట్టాల్సి వచ్చింది. జైపూర్ నుం యిక్కడికి రావడం లాంటి ఖర్చులకు అంతే లేదు; చాలా అయింది.

ఇంకొంత, నిధి కాష్‌గా మారితే తన బాధ దూది పింజెలా ఎగిరిపోతూంది. అప్పుడు తనపని మంచినీళ్ళలా ఖర్చుపెట్టడమేగా డబ్బుని. వచ్చే డబ్బుని ఏం చేయాలా? ఎలా ఖర్చు పెట్టాలా? అని చాలా సేపటివరకూ తలమునకలుగా ఆలోచిస్తూ ఉండిపోయాడు సాగర్.

కాసేపాగి చెప్పాడు. "డ్రైవర్! ఈ సిటీలో మంచి జ్యూయలరీషాపు దగ్గర ఆపు."

డ్రైవరు చూశాడు కొద్దిగా వెనక్కి తలతిప్పి. తెల్లగా విశాలంగా ఉందండి ముఖం. కళ్ళు ఎర్రగా తాగి నట్టున్నాయి. మీసం చివర్లు ఎర్రగా పండి మెలితిరిగి వున్నాయి. తలమీద టోపీ.

సాగర్ నిశ్శబ్దంగా చూశాడు డ్రైవరు వంక.

"జీజీ గారి షాపు ఈ సెంటర్‌లో బాగా సౌకర్యంగా వుంటుంది సార్ అన్నిటికంటే—పైగా అన్నీ ఖచ్చితంగా న్యాయంగా ఉంటాయంటారు!"

ఇక ఆలోచించలేదు సాగర్. "వెరీగుడ్. అక్కడికే పోనీ" చెప్పాడు ఉషారుగా.

పదనిమిషాల ప్రయాణం.

విశాలమైన వీధుల్ని ఎత్తైన ఖరీదైన అద్దాల భవంతుల్ని, నేల ఈనినట్టున్న జనసందోహాన్ని, సిమెంట్ ప్లాట్ ఫారాలపై, అక్కడక్కడా గుట్టలుగా ఉన్న మంచుని క్లీన్ చేస్తున్న వ్యక్తుల్ని ఆసక్తిగా గమనించాడు సాగర్.

టాక్సీ ఒక భవంతిముందు ఆగింది. ఫేర్ మీద మరో నోటు ఎక్కువగా చెల్లించాడు సాగర్. డ్రైవరు కృతజ్ఞతగా చూశాడు.

బాగ్ బరువును పళ్ళబిగువున మోస్తూ లోపలికి నడిచాడు.

ద్వారంపై 'జీ జ్యూయలర్స్' అనే అక్షరాలు ఎప్పుడో కొన్ని సంవత్సరాల క్రితం వ్రాసినట్టు ఉన్నాయి.

9

"రండి సాబ్ రండి! ఆ బాగ్ అలా ఉంచి సుఖంగా కూర్చోండి" సహజమైన నేర్పుతో హిందీలో ఆహ్వానించాడు లావాటి వ్యక్తి.

అతడి చుట్టూ చిన్నా పెద్దా అద్దాల చెక్క పెట్టెలు పద్ధతిగా అమర్చి ఉన్నాయి. వాటిల్లోంచి వెండి బంగారు వస్తువులు వింత శోభను వెదజల్లుతున్నాయి. గది ఇరుకుగా ఉంది.

తెల్లపంచె కొద్దిగా మాసి నలిగిన బనియన్, దబ్బపండు రంగు శరీరాన్ని మోస్తూ సాగర్, బాగ్ ను అనుకొని కూర్చుని "మిస్టర్ ...." అన్నాడు.

"వసంత్ జీ బసంత్ జీ" అన్నాడు లావాటి వ్యక్తి నవ్వుతూ. అతడి చూపులు వేటికోసమో ఎదురుచూస్తున్నాయి!!

"మిస్టర్ వసంత్ జీ బసంత్ జీ! నేను కొన్ని వజ్రాలు చూపుతాను. మీరు వాటికి న్యాయమైన ధర చెప్పాలి— అలా చెప్తే వాటిని మీకే అమ్మేస్తాను" జేబులో చెయ్యి పెట్టాడు సాగర్.

సంభాషణ హిందీలోనే సాగుతోంది.

జీజీ ముఖంలో ఆశ కనబడలేదు. "భలే ఆనందం. చూపించండి, చెబ్తాను" చురుకుగా కదిలి భూతద్దం, సాన రాయి అందుకొన్నాడు.

ఐదు వజ్రాలు గుప్పెటతో తీసి జీజీ చేతిలో పోసాడు సాగర్. వాటిని ముఖమల్ గుడ్డ అమర్చిన చిన్న బల్లపై ఉంచి, భూతద్దంతో పరీక్ష చేయసాగాడు జీజీ.

వాటి కాంతిని పరవశంగా చూస్తూ వచ్చే డబ్బును అంచనా వేసుకొంటున్నాడు సాగర్. అతడి హృదయంలో ఆనందపు వెల్లువ సముద్రంలా ఉప్పొంగుతోంది.

సరిగ్గా నిమిషన్నర గడిచింది. జీజీ కొద్దిగా తలెత్తి వినయపు ముసుగు తొలగించి చెప్పాడు "చ్...." అని ఆగి— "షోగ్గా వచ్చేరే పెద్ద!? డమ్మీ వజ్రాలివి!!"

కాసేపటికి గానీ అర్థం కాలేదు సాగర్ కి అతదేమంటున్నాడో "ఏమిటీ??" అన్నాడు.

"ఈ వజ్రాలు నకిలీవి" చెప్పాడు జీజీ పెద్దగా.

సాగర్ చేతులు వణుకుతున్నాయి. అన్యమనస్కంగా ముఖంపై చెమటలు తుడుచుకొంటూ "ఇవన్నీ పరీక్ష చేయండి" అని, బాగ్ విప్పి కుప్పగా అతడి ముందు పోసాడు.

"బాప్ రే!?!" తూలిగాడు జీజీ. నగలు బంగారం వజ్రాలు, వాటి కాంతిని వెర్రివాడిలా చూస్తూ.

"ఊఁ ....పరీక్షించండి" గద్దించాడు సాగర్. జీజీ కంగారుగా సానరాయి అద్దం అందుకొని, ఒక్కో వస్తువూ ముందుకు లాక్కొని చూడసాగాడు.

ఇంతలో సాగర్ కళ్ళను ఓ వస్తువు ఆకర్షించింది. నగలమధ్య ఇరుక్కొన్న కాగితం అది! చటుక్కున తీశాడు దానిని. ఏదో గజిబిజిగా వ్రాయబడి ఉంది దాని మీద!! చదవసాగాడు ...

అందులో ఇలా ఉంది—

"మిస్టర్ సాగర్,

నేనూ 'జెర్రీ'ని—శ్రద్ధగా చదువ్—ప్రొఫెసర్ గురుసింగ్ మా నాన్నగారు అకుంఠిత దేశభక్తుడాయన. డిజియానాపై నిధి ఉన్నట్టు ఆయన చరిత్ర శోధనలో బయల్పడింది. ఆ రహస్యాన్ని ఆయన ఏమాత్రం స్వార్థతత్వం లేకుండా ప్రభుత్వానికి తెలియపర్చాడు.

డిజియానా భారత సరిహద్దు లోపలికే ఉండడంవల్ల అది మన దేశానికే చెందుతుంది. సి.బి.ఐ., నిధికోసం వెదికే లోగా, మా నాన్నగారి స్నేహితుడు వృద్ధుడూ, మేక వన్నె పులి అయిన మీ అంకుల్ ముఖర్జీ ప్రేరేపణతో నువ్వు, జస్వంత్ మా నాన్నగారిని హత్యచేసి, రహస్యాన్ని దొంగిలించారు ...

ఆ వార్త తెలిసి స్టేట్స్ నుండి వచ్చిన నేను ముఖర్జీ ముసుగు లాగి విచారణ జరిపించాను. బహుశా వాడికి యావజ్జీవ శిక్ష పడవచ్చు. మిమ్మల్నీ చట్టానికి పట్టించవచ్చు! కాని చట్టం శిక్ష వేసినంత మాత్రాన నా హృదయ క్షోభ చల్లారుతుందా? అందుకే మిమ్మల్ని వెంటాడాను.

నాన్నగారు నిధి రహస్యం కనుగొన్నప్పుడు, అది కనుక్కొన్న ప్రాచీన గ్రంథం నుంచే ఆ నిధి ఏ రూపంలో ఉందో చూసి డిటైల్స్ వ్రాసుకొన్నారు. ఆ కాగితం నాన్నగారి గదిలో నాకు లభించింది. దాని ప్రకారం ఆర్టిఫిషియల్ వజ్రాలు, బంగారం, నగలు చీకటి బజారులో సంపాదించాను. మీరు ఖచ్చితంగా డిజియానా పర్వతం దగ్గరకే వెళతారు కాబట్టి నేనూ అక్కడికే వచ్చాను....

సి.బి.ఐ, పరిశోధనలో ముఖర్జీ ఇంటిలో దొరికిన మీ ఇద్దరి ఫోటోలు స్పష్టంగా చూశాను. ఆ ఆధారంతో నే పాల్కే బృందంలో చేరిన మిమ్మల్ని గుర్తించాను. నేనూ బృందంలో చేరాను. ఆర్టిఫిషియల్ నిధి నాతో పాల్కే పర్వతం పైకి తెచ్చాను....

ఆ రోజు రాత్రి మీరు బృందంనుండి వైదొలగాలను కోవడం గమనించి, నేనూ మిమ్మల్ని ఫాలో అయ్యాను.

నువ్వు. జస్వంత్ ను చంపడం చూశాను. నువ్వుపడుకో గానే మత్తుమందు స్ప్రే చేసి నిన్ను స్పృహ పోగొట్టాను. నా బాగ్ లోని ఆర్టిఫిషియల్ నిధి నీ బాగ్ లోనికి మార్చాను. (ఈ కాగితం కూడా అప్పుడే పెట్టాను.) అసలు నిధి నా వెంట తెచ్చి పోలీసులకు స్వాధీనం చేస్తు న్నాను—నువ్వు ఇది చదివేటప్పటికి నీ కోసం పోలీసుల వేట ప్రారంభమవుతూంది-కాచుకో!!

— నీ శత్రువు, బెనర్జీ."

10

"ఊహు....ఏం లాభంలేదు. ఇంచుమించు అన్ని చూసేశాను. ఒక్కటీ నిజమైందిలేదు. ఈ పెంటంతా గొప్ప నిధిలా తెచ్చాకేమిటీ!!" అడుగుతున్నాడు జీజీ.

అతడి కంఠంలో విసుగు, కోపం.

నిశ్శబ్దంతో కూడిన నిరాశతో మూగబోయి చూస్తున్నాడు సాగర్.

మౌనంగా అన్నీ బాగ్‌లో కూరేసి చెప్పాడు జీజీ "వెళ్ళండి ఇక."

గొంతు పెగల్చుకొని అడిగాడు సాగర్ హీనస్వరంతో, "మరి.... ఇవి ఇంత కాంతిగా మెరుస్తున్నాయేమిటి?!"

విసుగ్గా చూసి తప్పదన్నట్టు చెప్పాడు జీజీ. "బ్లాక్ మార్కెట్లలో అమ్మే ఆర్టిఫిషియల్‌వి ఇవి—నిజం వాటి కంటే, కాస్త మెరుపు ఎక్కువ ఉండేలాగానే తయారు చేస్తారు వీటిని!"

సాగర్ బాగ్ అందుకొని శూన్యంగా నడుస్తూ వెలుపలికి వచ్చి ప్లాట్‌ఫారం మీద నిలబడ్డాడు. అతడి ఎడం చేతిలో జెర్రీ వ్రాసిన కాగితం రెపరెపలాడుతోందింకా.

అతడి కళ్ళల్లో అంతులేని ఆశాభంగం. రెండు హత్యలు చేసినటువంటి రిస్క్! వారం రోజుల నిర్విరామ శ్రమ. ఫలితం శూన్యం!? నిరాశ నిస్పృహలు అతడి కళ్ళల్లో పోటీ పడుతున్నాయి!!

కాసేపటికి—

అతడి పెదాలపై చిరునవ్వు! నిర్లిప్తతతో కలసినదది. రోడ్డు రద్దీగా ఉంది. చలిగాలి వేగంగా వీస్తోంది. పెద్ద పెద్ద వాహనాలు వేగంగా బరువుగా సాగిపోతున్నాయి.

కాగితం కాసేపు రెపరెపమని గింజుకొని, సాగర్ చేతిలోనుండి విడిపించుకొని ఎగిరిపోయింది తన పని అయిపోయినట్లుగా.

రోడ్డుమీద పోయేవాళ్ళు కొంతమంది, పిచ్చివాడిలా బిగ్గరగా నవ్వుతున్న సాగర్ వంక వింతగా చూస్తూ

పోతున్నారు. క్రమంగా అతడినవ్వు వికృతంగా మారుతూంది!?!

మెరుపులా కదిలాడు సాగర్. క్రింద ఉంచిన బాగ్ జిప్ లాగి అందులో సంపదనంతా, బాగ్ గట్టిగాపట్టుకొని ఊపుతూ జల్లేశాడు. చెల్లాచెదురుగా ప్లాట్ ఫాంమీద రోడ్డుమీద పడ్డాయి డమ్మీ వజ్రాలు! నగలు!బంగారం!!

చాలామంది జనం అది పడినచోట పెద్ద గోలగా మాట్లాడుకొంటూ ఏరుకొంటున్నారు. నాలుగైదు క్షణాల్లో పరిస్థితి గందరగోళంగా మారింది. ఒకరినొకరు తోసుకొంటున్నారు.

దూరం నుండి. ఇద్దరు కానిస్టేబుల్స్ విజిల్స్ వూదుతుంటూ పరుగెత్తుకొని వస్తున్నారు.

పిచ్చిగా నవ్వుతూ నే వేగంగా దూసుకొని పరుగెట్టాడు సాగర్ రోడ్డుమీదికి—

గుంద్రటి పొడవయిన ఆయిల్ టాంక్ మోసుకొని వస్తూన్న లారీ, కీచుమని బ్రేక్ పడుతూండగా మరి కాస్త ముందుకి వచ్చి ఆగిపోయింది. దాని ముందు చక్రాల క్రింద పడున్నాడు సాగర్. అతడి చుట్టూ రక్తం మడుగు కడుతూంది.

శేఠ్ షాపులోనుండి ఆదరాబదరా పరిగెట్టుకొని వస్తున్నాడు.

ఎవరో వ్యక్తి పబ్లిక్ బూత్ లోనుండి పోలీసులకు ఫోన్ చేస్తున్నాడు.

మృతుడైన సాగర్ పెదవుల చివర్లనుండి ఓ రక్తపు చుక్క క్రిందికి జారి, అతని తల ప్రక్కనే పడి ఉన్న ఓ డమ్మీ వజ్రంపై పడి ఎర్రగా కప్పేసింది....

—: అయిపోయింది :—